కథ

# మానవత్వం



Ranga

బీర్రాజు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్.

మధ్యాహ్న సమయం.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్ బయలుదేరడానికి సిద్ధంగా ఉంది.

నేను, కిరణ్ కంపార్ట్‌మెంటులన్నీ వెదుకుతున్నాం. ఎట్టకేలకు మా కృషి ఫలించి మేం వెతుకుతున్న జనరల్ కంపార్ట్‌మెంట్ దొరికింది.

కానీ అప్పటికే ఆ కంపార్ట్‌మెంట్ జనంతో కిటకిటలాడుతోంది.

గుమ్మం దగ్గరే నిలుచున్న జనాన్ని చూసి కిరణ్ భయపడి, "వద్దులే, రాజేష్! ఈ రద్దీలో మనం పోలేం గానీ, మార్నింగ్ 'కృష్ణ'లో వెళ్దాం. టికెట్స్ కాన్సిల్ చేసేద్దాం, పద!" అన్నాడు.

నాకు ఒళ్లు మండింది కిరణ్ మాటలకు. "ప్రతిదానికీ అలా భయపడిపోతే జీవితంలో ఎందుకూ పనికిరాకుండా పోతాం. ఆఫ్టాల్ ...

ట్రైన్ రద్దీగా ఉందని వెనక్కిపోతామా ఆడవాళ్లలా!" అన్నాను కొంచెం కోపంగా.

"కోప్పడుకురా, బ్రదర్! సర్లే ఎలాగోలా సర్దుకుపోదాం, పద, పోదాం!" అన్నాడు.

నాకు చాలా అసహ్యం వేసింది. ఛీ, వెధవ ప్రయాణం ... సీట్లోంచి లేచి వెళ్లిపోదామంటే ఇంకో సీటు చచ్చినా దొరుకుతుందన్న నమ్మకం లేదు. సీట్లో అసహనంగా కదిలాను.



నేనూ, కిరణ్ జనాన్ని ఛేదించుకునిపోయి కంపార్ట్‌మెంట్‌లో లాండయిపోయాం.

ట్రైన్ బయలుదేరింది.

ఒక్కసారి ఊపిరి పీల్చుకుని కంపార్ట్‌మెంటంతా చూశాను. ఎక్కడా ఒక్క సీటు కూడా ఖాళీ లేదు. అప్పటికే మాలాగా చాలామంది నిలబడి ఉన్నారు.

కిరణ్ నిలబడే, తెచ్చుకున్న పుస్తకంలో లీనమైపోయాడు.

రైలు వేగం పుంజుకుంది.

కిరణ్ నా చిన్ననాటి స్నేహితుడు. ఎం.బి.బి.ఎస్. పాసై, కాకినాడలో హౌస్ సర్జన్సీ చేస్తున్నాడు. నేను బి.ఏ.తోనే చదువాపేసి ఉద్యోగంలో పడిపోవడంవలన వాడికంటే నేను పెద్దవాడిలా ఫీలవుతూంటాను. కిరణ్ సున్నితమైన వ్యక్తిత్వం కలవాడు. కొంచెం భయస్తుడు. మా ఇద్దరిదీ ఒకే ఊరు కావడంవల్ల, మాతో కలిసి చదివిన స్నేహితుని పెళ్లికి హైదరాబాద్‌కి వెళ్లి తిరుగుముఖం పట్టాం. పెళ్లిళ్ల సీజన్ కావడం వలన ఎంత ప్రయత్నించినా బస్సుకుగానీ, ట్రైన్‌కు గానీ రిజర్వేషన్ దొరకలేదు. ఫలితంగా దిక్కుమాలిన ప్రయాణం తప్పలేదు.

ట్రైన్ కాజీపేటకు చేరుకుంది.

అదృష్టవశాత్తూ నేను నించున్న పక్కనే ఉన్న సింగిల్ సీటు ఖాళీ అయింది. గబుక్కున దాంట్లో కూర్చుని కొంచెం జరిగి కిరణ్‌కి చోటిచ్చాను.

రెండుగంటలకు పైగా నిలుచున్నామేమో పీకుతున్న కాళ్లను ముందుకు చాపుకున్నాను. నా కాళ్లకు ఎదుటి సీటులోని వ్యక్తి కాళ్లు తగిలేసరికి "సారీ!" అంటూ నా కాళ్లు వెనక్కి లాక్కుని ఎదుటి సీటువైపు చూశాను.

అతనికి సుమారు నలభైఏళ్ల వయసుంటుంది. లాల్చీ పైజమా వేసుకుని ఉన్నాడు. కనుబొమలమీది వెంట్రుకలు రాలిపోయి, దళసరి చెవులతో, పెద్ద ముక్కుతో సగానికి పైగా ఊడిపోయిన రెండు చేతి వేళ్లతో చూడటానికి చాలా అసహ్యంగా ఉన్నాడు. అతనికి లెప్రసీ అని అతన్ని చూడగానే ఎవరైనా ఇట్టే చెప్పేయగలరు. నాలో ఓ బలహీనత.... చిన్నప్పటినుంచీ బాగా నాటుకుపోయింది. నాకు రోగిష్టులంటే చాలా భయం. ఒక విధమైన అసహ్యం కూడా. ముఖ్యంగా లెప్రసీ రోగమంటే నాకు చాలా ఎలర్జీ ... ఆ రోగుల్ని చూసినా, ఆ రోగం గురించి పేపర్లో చదివినా, నా వళ్లు జలదరిస్తుంది. మనిషి ఏదో పాపం చేయడంవల్లే అటువంటి రోగాలబారిన పడతాడని నాకో మూఢనమ్మకం.

ఓ ఈగ వచ్చి నా ముక్కు మీద వాలడంతో చిరాగ్గా, చేత్తో ఈగను తోలి ఛీదరింపుగా ఎదుటిసీటువైపు చూశాను.

ఎదుటి సీటులోని వ్యక్తి కమలాఫలాలు ఒలుచుకుని తింటున్నాడు. అతని చుట్టూ ఈగలు మూగి ఉన్నాయి.

నాకు చాలా అసహ్యం వేసింది. ఛీ, వెధవ ప్రయాణం ... సీట్లోంచి లేచి వెళ్లిపోదామంటే ఇంకో సీటు చచ్చినా దొరుకుతుందన్న నమ్మకం లేదు. సీట్లో అసహనంగా కదిలాను.

ఏదో స్టేషన్‌లో ట్రైను ఆగింది. కూల్‌డ్రింక్స్ తీసుకుని తాగాం.

"అబ్బ! వెధవ ప్రయాణాలు ... ఈ దేశం ఎప్పుడు బాగుపడుతుందో ఏమో!" పైకి అనేశాను.

"ట్రైన్ ఎక్కినప్పటినుంచీ చూస్తున్నాను, ఏమిటీ అంత చిటపటలాడిపోతున్నావ్ ... బయటి ఎండకా!" తను చదువుతున్న పుస్తకం పక్కన పడేసి నవ్వుతూ అన్నాడు కిరణ్.

"లేకపోతే ఏమిటిరా, పేరుకి ఫాస్ట్ ట్రైన్లు మనవి. టైమ్‌కి నడపాలన్న జ్ఞానం ఏ ఒక్కడికీ లేదు. ఏ ట్రైను ఏ టైముకొస్తుందో ఎన్నింటికి స్టేషన్ వదులుతుందో పాపం, రైల్వేవాళ్లకే సరిగ్గా తెలియదు!" వ్యంగ్యంగా అన్నాన్నేను.

"కారణం ఏమంటావ్?" అడిగాడు కిరణ్.


నేను ఏదో చెప్పబోయేలోగా, ఎదుటి సీటులోని వ్యక్తి కల్పించుకుని, "ఏముందండీ, పైనుంచి కింద వరకు ఉన్న ఉద్యోగుల్లో.. నిర్లక్ష్యం పెరిగిపోయి వృత్తిపట్ల నిజాయితీ లోపించడమే!" నవ్వుతూ అన్నాడు.


అతను చెప్పింది నిజమే అయినప్పటికీ అతనిమీద నాకు కోపం ముంచుకొచ్చింది.

ముక్కూ మొహం తెలీని మనుషులు, ఇతరుల సంభాషణల్లో కల్పించుకుని మాట్లాడటం, సభ్యత లేకుండా అడక్కుండానే ప్రయాణాల్లో ఇతరులు కొనుక్కున్న పుస్తకాలు చొరవగా తీసుకుని చదివేయడం, పైగా పక్కవాళ్లకిచ్చేయడంలాంటి పనులు నాకు సుతరామూ ఇష్టం ఉండదు. అటువంటి మనుషుల్ని చూస్తే, వాళ్లని నాలుగు తన్ని బుద్ధిచెప్పాలనిపిస్తుంది.

ట్రైను మళ్లీ బయలుదేరింది.

అప్పటివరకూ చెమటతో తడిసిపోయిన ఒంటికి, కిటికీలోంచి వేస్తున్న చల్లటి గాలి హాయిని కలిగిస్తున్నా, నా కెందుకో ఒళ్లంతా






చిటపటలాడుతున్నట్టు, ఒంటిమీద ఏవో తేళ్లు జెర్రులు పాకుతున్నట్టుగా ఉంది.

తెచ్చుకున్న పుస్తకంమీద మనసు లగ్నం కావడంలేదు. నా అవస్థను గమనించిన కిరణ్ "సిగరెట్ కాలుస్తావా?" అడిగాడు జేబులోంచి సిగరెట్ పాకెట్ తీసి తనొకటి తీసి నోట్లో పెట్టుకుంటూ.

"ఊహుం, వద్దు ..." అన్నాను తల అడ్డంగా ఊపుతూ.

ఓ నిమిషం మౌనంగా గడిచింది.

"మీరిద్దరూ ఎంతవరకూ బాబూ?" అడిగాడు ఎదుటి సీటు వ్యక్తి.

"నేను రాజమండ్రి, మావాడు సామర్లకోట వరకు!" చెప్పాడు కిరణ్.

"నేనూ సామర్లకోటలోనే దిగుతాను!" అడక్కుండానే చెప్పాడు ఎదుటి సీటులోని వ్యక్తి.

నా కోపం తారాస్థాయి చేరుకుంది.

"వాడితో నీకేం మాటలురా" ఇంగ్లీషులో అరిచాను బహుశా ఎదుటి సీటులోని వ్యక్తికి ఇంగ్లీషు తెలియదనే భావంతో.

"నేనేం మాట్లాడలేదురా, అతనే పలకరించాడు!" అని లేచి టాయ్‌లెట్‌కి వెళ్లొస్తానంటూ వెళ్లిపోయాడు.

ఇంతలో ...

ఆపిల్స్ అమ్మే అతను వస్తే నా ఎదుటి సీటులోని వ్యక్తి బేరమాడి ఓ నాలుగు పళ్లు కొనుక్కుని తన పక్కనే పెట్టుకుని ఒక పండు తీసి నాకిస్తూ, "తీసుకోండి, మాస్టారూ!" అన్నాడు.

నాకు చిర్రెత్తుకొచ్చింది.

"ఏమిటండీ మీ ఉద్దేశం? నాకు తినాలనిపిస్తే ఆ మాత్రం కొనుక్కోలేనా? మీ రిచ్చే ముష్టికోసం కాచుక్కూర్చున్నా ననుకున్నారా? ముక్కూ మొహం తెలీని వాళ్ల దగ్గర ఇటువంటివి నేను తీసుకోను! అయినా, ఎవరి హద్దుల్లో వాళ్లుంటే మంచిది!" నా చూపుల్లో వీలైనంత అసహ్యం, మాటల్లో చెప్పలేనంత కాఠిన్యం ప్రదర్శిస్తూ అన్నాను.

నా మాటలకు అతను బిక్కచచ్చిపోయి తన సీటుకతుక్కుపోయాడు.

మొహం తుడుచుకుంటూ వచ్చిన కిరణ్, నా వాలకం చూసి, "ఏమిటిరా? ఏమైంది, మొహం అలా పెట్టావు?" అడిగాడు.

"ఫ్రంట్ సీటుకి ఓ డోసిచ్చానులే ... ఆపిల్స్ కొని, దానం చెయ్యబోయాడు ధర్మాత్ముడు! అయినా, కిరణ్! ఇలాంటి రోగమున్న మనుషుల్ని పబ్లిక్ స్థలాల్లో అనుమతించకూడదురా! అంటురోగుల్ని దూరంగా ఉంచితే సమాజానికి ఎంతో మేలు జరుగుతుంది!" నెమ్మదిగా, ఎదుటి వ్యక్తికి వినిపించనట్టన్నాను ఇంగ్లీషులో.

కిరణ్ కొద్దిసేపు ఏమీ మాట్లాడలేదు. తర్వాత అన్నాడు

"ఒరేయ్, రాజేష్! పాపం, అందరూ వాళ్లని చీదరించుకుంటుంటే వాళ్లు సమాజంలో ఎలా బతగ్గలుగుతారు? వాళ్లూ మనుషులే. వాళ్లకీ బంధువులు, స్నేహితులు ఉంటారు. అందరూ తోసిపారేస్తే, ఎక్కడికైనా వెళ్లాలంటే ఎలా వెళ్తారు? చదువుకున్న మనం అలాంటి వ్యక్తులమీద సానుభూతి చూపించాలే గానీ అసహ్యించుకోకూడదు!" తను కూడా ఇంగ్లీషులో సంభాషణ కొనసాగిస్తూ.

"అలాగని ఒక వ్యక్తి గురించి అతని చుట్టూ ఉన్న పదిమందీ ఆ రోగం అంటించుకోవాలంటావా? నువ్వెంత డాక్టరువైనా, రోజూ రోగుల్ని ముట్టుకుని పరీక్షించేవాడివైనా, ఇంత సానుభూతి పనికిరాదు!" అన్నాన్నేను.

"కానీ, నువ్వనుకున్నట్టు అతనిది అంటురోగం కాదు! నీకు తెలియదురా ... లెప్రసీలో చాలా రకాలున్నాయి. వాటిలో కొన్ని మాత్రమే అంటురోగాలు. హన్‌సేన్ అనే ప్రముఖ వైద్యుడు ఆ జబ్బుమీద చాలా పరిశోధన చేశాడు. కాబట్టి అతని పేరుమీద ఆ జబ్బును న్యూరోహన్‌సేన్ డిసీజ్ అన్న పేరుతో పిలుస్తోంది వైద్య శాస్త్రం. జాగ్రత్తలు తీసుకుంటే ఇదేం ప్రమాదకారి కాదు. లెప్రసీ అనేది మామూలు వాడుకభాషలో ఆ జబ్బుకున్న పేరు." అన్నాడు కిరణ్ ఆ జబ్బు గురించి క్లుప్తంగా వివరిస్తూ.

"నువ్వేన్నయినా చెప్పు, ఆ జబ్బు అంటురోగమైనా, కాకపోయినా పదిమందికీ అసహ్యం కలిగించేది కాబట్టి ఆ మనుషుల్ని దూరంగా ఉంచటమే మంచిది!" అన్నాను.

"నిజమేరా! ఫూల్! నువ్వన్నట్టు వాళ్లంతట వాళ్లే ఈ సమాజంలో దూరంగా బతుకుతున్నారు నీలాంటివాళ్లకి భయపడి. అయినా, రాజేష్! ఒకవేళ అటువంటి రోగమే నీ కొస్తే ఏం చేస్తావురా?"

"ఒరేయ్, కిరణ్! ఆపరా ఈ టాపిక్. అసలు ఆ ఊహే భరించలేను నేను!" భయంతో వణికిపోతూ అన్నాను.

"సర్లేరా, టేకిటీజీ! జీవితం గురించి ఎన్నో ఉపన్యాసాలు ఇచ్చే మనిషివి, ఈ ఫోబియా ఏమిటిరా నీకు?" అన్నాడు నవ్వుతూ కిరణ్.

కొన్ని నిమిషాల తర్వాత ఎదుటి సీటువైపు చూశాను. కిటికీకి తల ఆన్చి ఆ వ్యక్తి కునుకు తీస్తున్నాడు.

రైలు రాజమండ్రికి చేరుకుంది.

"బై!" చెప్పి, కిరణ్ దిగిపోయాడు.

ట్రైను బయలుదేరిన కొద్దిసేపటికి చిన్నగా వర్షం మొదలైంది.

నా సీట్లో కాళ్లు మునగదీసి పెట్టుకుని, కిటికీ తలుపు మూసేసి కళ్లు మూసుక్కూర్చున్నాను.

000 000 000

ట్రైను సామర్లకోట చేరేటప్పటికి అర్ధరాత్రి దాటింది.

స్టేషను బయటకొచ్చేటప్పటికి బయట బస్సులు గానీ, టాక్సీలు గానీ, రిక్షాలు గానీ లేవు.

ట్రైను ఆ రోజు ఆలస్యంగా నడిచినందువల్లో, లేక వర్షం పడటంవల్లో తెలియదు గానీ, ఎప్పుడూ బిజీగా ఉండే ఆ ప్రదేశం దాదాపు నిర్మానుష్యంగా ఉంది.

నేను అక్కడనుంచి బయలుదేరి పెద్దాపురం వెళ్లాలి. నాకు కడుపులో సన్నగా నొప్పి మొదలైంది.

ఏ లారీ అయినా అటు వెళ్తే దానిమీద వెళ్దామని సెంటర్లో నిలబడ్డాను గానీ, అటువైపు వచ్చిన ఒకటి రెండు లారీలు ఆగీ ఆగకుండా వెళ్లిపోయాయి.

నాకు కడుపు నొప్పి ఎక్కువవడం మొదలైంది. నాకు రెండు మూడు సంవత్సరాల నుంచి ఈ నొప్పి వస్తోంది. ఎంతోమంది డాక్టర్లకు చూపించుకున్నాను గానీ, ఫలితం కనపడలేదు పెద్దగా.

పక్కనే మూసి ఉన్న బడ్డీకొట్టు దగ్గర బల్లమీద కూలబడ్డాను. నొప్పి భరించరానిదిగా ఉంది.

చలిగాలి రివ్వున వీస్తోంది. అప్పటివరకూ మబ్బుపట్టిన ఆకాశం తుంపర్లు కురవడం ప్రారంభించింది.

ఎలోగోలా ఏదైనా ఆసుపత్రికి చేరుకుందామంటే జేబులో సరిపడినంత డబ్బుల్లేవు. పైగా, లేచి నిలబడి ఒక్క అడుగు కూడా వేయలేని పరిస్థితిలో ఉన్నాను. నాలో అలజడి మొదలైంది. మొదటిసారిగా చావు భయమంటే ఏమిటో తెలిసింది.

కళ్లల్లో నీళ్లు తిరిగాయి. చచ్చిపోయిన అమ్మా, నాన్న గుర్తొచ్చారు. ఊళ్లో ఉన్న అక్కయ్యలు కళ్లల్లో మెదిలారు.

నేనుగానీ ఈ బల్లమీదే దిక్కుమాలిన చావు చచ్చిపోతానా? భయంతో నా గుండె దడదడలాడింది.

నిమిషాలు గడుస్తున్నాయి. నొప్పి ఉధృతంగా వస్తోంది.

దూరంగా అడుగుల చప్పుడవుతుంటే తలతిప్పి చూశాను. ఎవరో టార్చ్‌లైట్‌తో నావైపే వస్తున్నారు. నాలో ఆశ తళుక్కుమంది.

వచ్చిన వ్యక్తి నా మొహంమీద లైటు వేసి చూసి, "మీరా, మాస్టారూ! ఏమైంది?" అడిగాడు.

"కడుపులో విపరీతమైన నొప్పి. భరించలేకుండా ఉన్నాను. ఇక్కడేదైనా హాస్పిటల్ ఉందా?" ఆ వచ్చిన వ్యక్తి ఎవరైందీ పట్టించుకోకుండా అడిగాను.

"ఈ రోజు ఆదివారం కదా! ప్రైవేటు హాస్పిటల్స్ ఉండవు. ధర్మాసుపత్రులున్నా, ఈ వేళప్పుడు మనలాంటోళ్లని పట్టించుకునేదెవరు? ఉండండి, ఇప్పుడే వస్తాను!" అని వెళ్లిపోయాడు.

అతను వెళ్లిన తర్వాత అనిపించింది ఇతని గొంతు ఎక్కడో విన్నట్టుందని.

పావుగంట తర్వాత తిరిగొచ్చి అన్నాడు "మాస్టారూ! లేచి, సోడాతో ఈ బిళ్లలు వేసుకోండి!" సోడా బాటిల్, టాబ్లెట్స్ నా చేతిలో పెడుతూ.

మందు బిళ్లలు మింగి పడుకున్నాను.

"ఊళ్లో కొట్లన్నీ మూసేసి ఉన్నాయి. చాలా దూరం వెళ్లి, తెలిసున్నవాడిని లేపి పట్టుకొచ్చాను. సోడా సీసా ఇచ్చేసి వస్తానుండండి!" అంటూ వెళ్లిపోయాడు.

నాకు నిద్రపట్టేసింది.

000 000 000

"మాస్టారూ! లేవండి, తెల్లారిపోయింది!" అంటూ లేపిన ఆ వ్యక్తిని తేరిపార చూశాను.

రాత్రి బాధలో గుర్తుపట్టలేదు. అతను ట్రైనులో నా ఎదుటి సీటులో కూర్చున్న వ్యక్తి. పన్నెండు గంటలకు పైగా చేసిన ప్రయాణంలో ప్రతిక్షణం అసహ్యించుకున్న వ్యక్తి.

"రాత్రి...?" అన్నాను నెమ్మదిగా.

"అవును, మాస్టారూ! పాపం, రాత్రంతా మీరు చాలా బాధపడ్డారు. ఇప్పుడెలా ఉంది? హాస్పిటల్‌కు వెళ్దామంటారా?" అడిగాడు.

వద్దన్నట్లుగా బుర్ర ఊపి, "ఇప్పుడు బాగానే ఉంది!" నా గొంతు నీరసంగా పలికింది.

లేవబోతున్న నన్ను చూసి, "ఉండండి మాస్టారూ! ఒక్క నిముషం ..." అని, "ఒరేయ్ రంగా! టీ ఒకటి పట్రారా!" అని కేక వేశాడు.

అయిదు నిముషాల తర్వాత ఓ కుర్రాడు పక్కనున్న హోటల్‌నుంచి టీ గ్లాసు తెచ్చి నా చేతిలో పెట్టాడు.

టీ తాగడం పూర్తయిన తర్వాత అన్నాడు "పదండి, మాస్టారూ!"

నేను మంత్రముగ్ధుడిలా అతన్ని అనుసరించాను.

బస్సు బయలుదేరడానికి ఐదు నిముషాల టైముంది.

"ఒక్కరే వెళ్లగలరా, నన్నూ రమ్మంటారా?" అడిగాడు.

"ఫర్వాలేదు, వెళ్తాను. మీ బాహ్య రూపం చూసి మిమ్మల్నెంతో అసహ్యించుకున్నాను. మీలో ఇంత గొప్ప మనసుందని ఊహించలేదు. మీ కాలి గోటికి కూడా సరిపోని వ్యక్తిత్వం నాది. స్వంత మనుషులు కూడా సరిగ్గా పట్టించుకోని ఈ రోజుల్లో, మిమ్మల్ని అసహ్యించుకున్న నాలాంటి మనిషిని తెల్లవార్లూ కంటికి రెప్పలా చూసుకున్నారు!" అతని రెండు చేతులూ ఆప్యాయంగా అందుకుని కళ్లకద్దుకున్నాను.

నా కళ్లల్లోంచి రెండు కన్నీటి బొట్లు రాలిపడ్డాయి.

అతని చేతులు వదలి గబగబా వెళ్లి బస్సులో కూర్చున్నాను.

బస్సు కదిలింది.

కనుమరుగవుతున్న అతనిలో దేవుణ్ణి చూశాను. ■

